భూతల స్వర్గసీమ-

# గ్రామసీమలో విప్లవవేత్త

యస్. సూరి

నాకు పల్లెటూళ్ళ పరిచయం చాల తక్కువ. అసలు లేదనే చెప్పాలి నాయీ యిరవై సంవత్సరాల్లోనూ ఏ రెండుమూడుసార్లో పల్లెలకి వెళ్ళవలసి వచ్చింది. అదైనా యే పెళ్ళిళ్ళకో మాత్రమే. అప్పుడుకూడా పల్లె జీవితం అనుభవం కాలేదు నాకు.

కాని పుస్తకాలలోమాత్రం చదువుతుండే వాడిని: అవి చాలా ఆరోగ్యమైన ప్రదేశాలనీ, అక్కడ ప్రజలు అమాయకులనీ (ముఖ్యంగా కర్షకులు), వూరికి యే నొకరో ఆరో డబ్బు కలవారు వుంటారనీ, తతిమాజనం చేత సంవత్సరం పొడుగునా పనిచేయించుకొని పండించినపంట అంతా తీసుకవచ్చి తమ యిండ్లలో పోసుకొంటారనీ, యే కొద్దిమాత్రమైనా వారికి దయవుంటే యిస్తారనీ, లేకపోతే అదీ లేదనీ.

విచిత్రమేమంటే తిండికి లేకపోయినా, తమ కష్టార్జితం ఉట్టిదుగంగా తీసుకపోతున్నా వారు పల్లెత్తుమాట అనరు. దౌర్జన్యం, ప్రతీకారం నామ మాత్రంకూడా లేదు. సంవత్సరం పోయినా రోజులు చెమటోడ్చి పండించిన పంట రాసి మీద వుండగానే అంతా యజమాని తీసుక పోతుంటే తిరగబడి చితకపొడవవలసిందిపోయి, నోరెత్తి పల్లెత్తుమాట అనరు. ఏమన్నా అడిగితే తమ సంతోషం కొద్దీ రెండు పూటలకి గ్రాసం మాత్రము యాచించవచ్చు.

ఎంత సహనం! ఇంతకంటె విపరీతమైన సంగతీ, ఇంత ఆశ్చర్యమైన విషయమూ మరొకటి వినగలమా?

వాళ్లు అంత అమాయకులూ, వాళ్ళ హృదయాలు అంత విశాలములూ కనుకనే పైతరగతివారి ఆటలు సాగుతున్నై అనటానికి సందేహమేమిటి? కారల్ మార్క్సు కూడా మనదేశం మీద వ్రాస్తూ "హిందూదేశస్థులు వట్టి అమాయకులనీ, వాళ్ళ హృదయం నవనీతమూ వారిగుండెలు జాలిగుండెలనీ, కపటం మోసం అనే మాటలున్నవనే సంగతే వారికి తెలియదనీ, ఇంగ్లీషువారు అంత తేలికగా గెలవగలిగారంటే దానికి కారణం వారు కృత్రిమంగా ప్రవర్తించటమే అనీ" అన్నాడు. అందులో ప్రతి అక్షరం సత్యం. ఎంత మంచి హృదయం లేకపోతే తమ నిజమైన హక్కు అని తెలిసికూడా యితరులు అన్యాయంగా కాజేస్తుంటే 'ఏమి శాశ్వతం?' అన్నట్లు ఒక వైరాగ్యపు చూపు చూసి వూరుకొంటారు?

పైపెచ్చు అక్కడ కూరలూ, పాలూ, వెన్నా మొదలగు సమస్తమైన ఆహారమూ చాలా పుష్టికరమైనది లభిస్తుందనీ, అక్కడిప్రజ (ముఖ్యంగా కష్టపడేవారు) చాలా ఆరోగ్యంగా వుంటారనీ, 'నాగరికత' అని మిడిసిపడే పట్టణవాసులు ఎంత బలహీనతతో రోగాలతో బాధ పడుతున్నదీ-మన నాయకులవల్ల తరచు ప్రకటనలద్వారా వింటూండేవాడిని.

దీర్ఘమైన యిరవైసంవత్సరాల బస్తీ "హాబ్ అబ్"తో విసిగి పల్లెటూరు (మా స్వగ్రామం) వెళ్ళి వుండటానికి నిశ్చయించాను. అందుకు ముఖ్యకారణం ఆ అమాయకులకు నిజపరిస్థితి తెలియజేసి వారిని విప్లవోన్ముఖులను చేద్దామనే నా ఆశయమే. వారికి రష్యా భూతల స్వర్గాన్ని పరిచయంజేసి వారినికూడా భూతల దేవతలని చేయటం నా ప్రధాన ఆదర్శం. నాకు తెలుసు, యెప్పటికైనా మానవకోటి ఆశాజ్యోతి కమ్యూనిజం అని. పైగా ప్రపంచ కష్టజీవులంతా రష్యావైపు అఱ్ఱు చాచి చూస్తున్నారు. అందుకు వారిలో విప్లవ చైతన్యం కలిగించి వారిని విప్లవ వీరులుగా చెయ్యాలి. పతన మవుతున్న సంఘవ్యవస్థని, సామ్రాజ్యవాదాన్ని కాలరాచి, దానిస్థానే చిరస్థాయి అయిన కమ్యూనిజాన్ని స్థాపించాలి. ప్రత్యక్షపు దోపిడీ విధా

నాన్ని రూపుమాపాలి. ప్రపంచకార్మిక రాజ్యం స్థాపించాలి.

నాకు తెలుసు సాంఘికవ్యవస్థా, దాని లోపాలోపాలు. నేను మార్క్సిజం గూర్చి మాట్లాడుతుంటే నాతోటి కామ్రేడ్సు నోరు తెరుచుకొని వినేవారు. నా యీ అపార జ్ఞానసంపదను చూసి ఆశ్చర్యపోయేవారు. "కారల్ మార్క్స్ తిరిగి ప్రాణం పోసుకవచ్చాడా అనిపిస్తుంది నిన్ను చూస్తే" అని తరచు అంటుండే వారు. "పెట్టుబడి" దగ్గరనుంచి "అందరికీ తిండి" దాకా అన్నిరంగాలూ కరతలామలకము నాకు. ఏమహాసభ జరిగినా నేను లేనిది పరిపూర్ణత్వం వుండేది కాదు. నా యీ సర్వతోముఖమైన ప్రతిభ చూచి ఎంతోమంది-ఆడ, మగ - (కామ్రేడ్స్ మాత్రమే కాక) యితరత్రా కొత్తవారుకూడా నాతో పరిచయానికి ఎంతో తపించి పోయేవారు. నాతో పరిచయం వారి కదో మహద్భాగ్యంగా భావించేవారు.

కానీ, విచారకరమైన విషయమేమిటంటే, నా రాజకీయ జీవితం అంతా రాజకీయ పాఠశాలల్లో పాఠాలు చెప్పి వర్కర్సును తయారుచేయటమే అయింది. సర్వవ్యాప్తమైన విప్లవ కార్యక్రమానికి తగినంతమంది ప్రచారకులు లేకపోతే యేమీ ప్రయోజనం ఉండదు. అందుకోసం ప్రచారకుల్ని తయారుజేయటం ముఖ్యం అయింది. అసలు నన్ను 'ప్రొఫెసర్' అని పిలిచే వారే యెక్కువ. అంతకుముందు వర్కర్లకి రాజకీయాలు తెలిసేవికావు. నేను వచ్చాక ప్రతి వర్కరూ మెరికలాగా తయారైనాడు. వాదనలో ఎలా మాట్లాడాలో, జాతీయవాదిని ఎలా నోరు మూయించాలో, యీ కిటుకులన్నీ నేర్పేశాను.

నేను ఆడవాళ్ళక్లాసు ఆర్గనైజ్ చేసే రోజుల్లో లెక్చర్లు యిస్తుంటే వాళ్లు నా 'ధార' చూసి 'లవ్ సిక్' అయి పోయేవారు. ఆ ప్రేమ లేఖలు పోగుచేస్తే 'విజ్ఞాన సర్వస్వం' అంత సంపుటాలు ఎన్ని అయేవో!

## II

ఆ అమాయకులను విప్లవచైతన్యులుగా చేయటానికిగాను మా వూరు బయల్దేరి వెళ్లాను. వూరికి రెండు మైళ్లలో కారు దిగాను. నేను వస్తానని ముందుగానే తెలియటంవల్ల కారు దిగేటప్పటికి బండి వచ్చివుంది. బండి ఎక్కి కూర్చున్నాను. కటికి చీకటి. కళ్లు చించుకున్నా ఏమీ కనబడటంలేదు. శబ్దంవల్ల ఎడ్లు నీళ్లలో నడవటం లేదనీ, యీదుతున్నాయనీ వూహించగల్గాను.

పోతూ పోతూవున్న బండి ఒక్కసారి ఆగిపోయింది. జీతగాడు ఎంతకొట్టినా ప్రయోజనం లేకపోయింది. విధిలేక చివరికి దిగాను. అది ఒక పెద్దబాడి. ఆ బాడిలోంచి బయట పడేటప్పటికి కనీసం ఒక అరడజను సార్లయినా కాలు జారి పడివుంటాను.

ఎట్లా అయితేనేం వూరిలోకి వచ్చాము. వూళ్లోకి ప్రవేశించిన కొద్దీ దుర్వాసన ముక్కులు బద్దలు కొట్టేస్తోంది. మేము నడుస్తూ నడుస్తూ మధ్యమధ్య చిన్నచిన్న దిబ్బలు ఎక్కుతూ దిగుతున్నాం. దిబ్బ ఎక్కినప్పుడు కాలి కింద మెత్తగా వుంటోంది. 'ఏమిటిది మెత్తగా వుంది?' అని అడిగాను 'పెంటపోగు' అన్నాడు.

'బజార్లో పెంటపోగేమిటి?'

వాడికేం అర్థం కాలేదల్లేవుంది. 'ఇక్కడంతా యింతే' అన్నాడు.

నడుస్తూ, 'ఇక్కడ కాస్త చూసి నడవండి-కుడిపక్క ..' అని అంటూనే వున్నాడు, నేను బోర్లా బొక్కలుగా ఒక మురుగు గుంటలో పడ్డాను. చెడ్డ దుర్వాసన కడుపులోపలినుంచి దేవినట్లయింది. పాలేరు వచ్చి లేవదీశాడు. నాకు చెడ్డ అసహ్యం వేసింది. ఎట్లాగయితేనేం పడుతూ లేస్తూ యింటికి చేరుకున్నాం. ఆ రాత్రి సబ్బుతో ఎంత తోమినా ఆ దుర్వాసన నిశ్శేషంమాత్రం కాలేదు. అట్లాగే రెండు మెతుకులు నోట్లో వేసుకొని నడుం వాల్చాను. ముందు కార్యక్రమానికి త్రోవలు వెతుకుతూ నిద్రపోయాను

ఉదయం కాఫీ తాగేసమయానికల్లా పలకరించటానికి వచ్చారు కొందరు. అందరం కాఫీత్రాగి ఒక్కసారి వూరు నాల్గు మూలలూ చూసివద్దామని బయల్దేరాము.

చాలాభాగం అన్నీ పూరిగొంపలే. ఆ యింటి కప్పులలోంచి పొగ నాల్గు మూలలా చుట్టలు చుట్టలుగా వస్తోంది. ఇంక ఎటూ పోవటానికి దారిలేక కప్పును తోసుక వస్తోందని తెలుస్తూనే

వుంది. ఇంటికి విశాలమైనదొడ్డి, యింటిముందు పూలతోట లేకపోతే మానె, ముందుగానీ వెనక గానీ ఒకగజం స్థలంగూడా లేదు దాదాపు అన్ని యిళ్ళకీ. ప్రతి యిల్లూ ఒకదానిమీద ఒకటి ఉంది. ప్రతియింటిముందూ ఒక పెంటపోగూ, ఒక మురుగుగుంటా బజార్లోకి. లోపల గొడ్లచావడి. దాంట్లోంచి దోమల సంగీతం వినవస్తూంటుంది బజార్లో పోయేవాళ్ళకి. ఆ చావడి నానుకొని అటు పక్క కూర్చునే మరొక చావడి, యిటు పక్క పడకగది.

బజారువెంట నడుస్తున్నాము. కొంతదూరం పోయేసరికి ఒక పదిహేనుగజాల నీటిమడుగు కనిపించింది. దాన్నిండా నీరు నిల్చివుంది. కుడి పక్క గోడ ఆ గొయ్యిలోకి కూలిపోయివుంది. ఎడమ పక్కగోడ మరోక్షణంలో పడిపోవచ్చు.

"ఏమిటి బజార్లో గొయ్యి? దీని నెవరూ బాగుచేయించలేదేం? ఆ యిల్లు కూలిపోయిందే. మీ ఎవరికీ కనుపించటంలా?" అని అడిగాను.

"ఆయన యిల్లు కూలిపోతే ఎవరేం చేస్తారు? వాడెంతవాడనుకున్నారు? నేను వెంకయ్యమీద వ్యాజ్యెంవేస్తే వీడు వెళ్ళి వెంకయ్యపక్షం సాక్ష్యం యిచ్చాడు. ఈ వూళ్లో ఎవర్నయినా అడగండి, ఆ గట్టు వెంకయ్య చేలోదో నాచేలోదో. పాపం పండదూ?"

ఆ తగాదా ఏమిటో, ఆ సాక్ష్యమేమిటో తెలియకపోయినా నేను ఆయనచెప్పే దాని కల్లా 'ఊ' కొట్టాను.

అక్కడినుంచి కుడిపక్కగా వెళ్ళాము. ఒక చెరువు బజారును కోసుకొని ఊళ్లోకి చొచ్చుక వచ్చింది. నీళ్లలో పాతిక గజాలలోపల కప్పు మాత్రమే కన్పించే గొడ్లపాక నీళ్ళపై తేల్తూ వుంది. పక్కన ఉన్న గుడిగోడ సగము చెరువు లోకి కూలి ఉంది. చెరువుకి ఆవతల పక్క యిళ్లున్నవి. "వాళ్లు యిటురావాలంటే ఎట్లా?" అన్న నా ప్రశ్నకి గాలిలో అర్థచంద్రాకారంగా గీసి చూపించారు.

దీన్ని బాగు చేయించాలనే సంకల్పం యిది వరలో ఒకసారి కలిగి, చివరికి "నువ్వు అపుడట్లా చేశావు" అంటే "నువ్వు యిపుడిట్లా చేశావు" అనే దెప్పుళ్లతో సంకల్ప విరమణ జరిగిందిట.

## III

నా వుద్దేశ్యం ఏ ఒక్కరితోనూ నెరవేరేది కాదు. అందుకోసం కొంతమంది వుత్సాహ వంతులైన యువకులు కావాలి. నా దగ్గర కీయువకులు వస్తూపోతూనే వున్నారు. సిగరెట్లు టిన్నులకు టిన్నులు ఎగిరిపోతూనే వున్నాయి.

ఒకరోజున యువకమండలిలో నా వుద్దేశ్యం తెలియపర్చాను. తమ కెట్టి అభ్యంతరంలేదనీ, తమ శక్తికొలదీ సహాయం చేయగలమనీ వాగ్దానం తీసికొన్నాను.

ఇది పనుల రద్దీ సమయమనీ, సమ్మె సానుకూలం కావడానికి యింతకంటె మంచి సమయం రాదనీ చెప్పాను. సమ్మె కష్టజీవుల పాలిటి వజ్రాయుధమనీ, అదే అంతిమమైనది, ప్రధానమైన ఆయుధమనికూడా చెప్పాను. మర్నాడు ఉదయం 9 గంటలకు కూలీ నాయకుల్ని సమావేశపర్చాలనికూడా నిశ్చయించుకొన్నాము.

మర్నాడు 10 గంటలైనా ఎవరూ రాలేదు. చివరికి రామారావు మాత్రం వచ్చాడు. పాలేర్ని పిలిచి కూలీనాయకుల్ని పిల్చుకు రమ్మని పంపాము.

ఇంతట్లో వంట పంతులు లోపల్నించి వచ్చి 'ఈరోజు భోజనంలోకి ఏమి చేయమంటారు?' అని అడిగాడు.

వీడి భావ పరివర్తన చూసి నాకు ఆశ్చర్యం వేసింది వాడి జన్మలో వాడెప్పుడూ అట్లా అడిగి యెరగడు- వాడిష్టంవచ్చినదీ, యింట్లో వున్నదీ చెయ్యటం తప్పితే. నాకు చెప్పి చేయించటం విసుగు. అందుకని "యేదో ఒకటి చెయ్యి, ఏది అమ్మవస్తే అది" అన్నాను.

'అస లేదీ అమ్మరాలేదు' అన్నాడు.

'ఏదీ అమ్మరాకపోవటమేమిటి? దొరగారు యిప్పుడే నిద్ర లేచారుకామోసు.' అన్నాను.

'కాదండీ, అసలు యిక్కడ కూరలు అమ్మరావట.'

'నీ వెక్కడో అడవిలో పుట్టవలసిన ద్విపాద పశువ్వి-నీ కేమైనా బుద్ధి అనేది వుంది? అసలు పల్లెటూళ్లు ఎందుకు ప్రసిద్ధో తెలుసా? కాయ కూరలకి." అని వాణ్ణింకా పశువును చేస్తున్నాను.

ఈ నా మహా ప్రయత్నానికి అడ్డువచ్చి 'నిజమే, యిక్కడకు అమ్మరావు. కావాలంటే

దొడ్లో కాపించుకోవలసిందే' అన్నాడు రామారావు - కొత్తగా అధికారంలోకి వచ్చిన అమాత్య శేఖరునికి మల్లే.

'సరే - నామాట కాదు. కాయకూరలు పండించుకోటానికి తగిన వసతి వున్నది నా బోటి కొద్దిమందికేగా. తతిమ్మావాళ్లు?'

'తతిమ్మావాళ్లకి ఒక కూరేయేమిటి? మజ్జిగ నీళ్లుకూడా లేవు. తెల్లవారుజామునే కాఫీ హోటళ్లకి వతనగావచ్చి పోయించుక పోతారు, చుక్క లేకండా. పెరుగు, మజ్జిగ, నెయ్యి యెప్పుడో పోయాయి వారి స్మృతిపథంనుండి. కాయకూరలూ ఎప్పటికప్పుడు బస్తీకి పోవలసిందే. కూర్చొని తింటానికి అన్ని వీల్లూవున్న మీ బోటి యే కొద్దిమందికో తప్ప తతిమ్మావాళ్లకి మజ్జిగనీళ్లుకూడా వుండవు.' అని అన్నాడు రామారావు.

నా వూహా చిత్రాలు ఒక్కొక్కటే యిట్లా చెల్లాచెదరవటం చూసి నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

"పొద్దున్నే శేరుపాలు దొరికే టప్పటికి తల ప్రాణం తోకకు వచ్చింది. అయినా పచ్చి నీళ్లు. బెజవాడే నయం." అన్నాడు పంతులు.

"మరి పల్లెలు చాలా ఆరోగ్యమైన ప్రదేశాలనీ, యిక్కడ చాలా పుష్టికరమైన ఆహారం లభిస్తుందనీ వినేవాణ్ణే?"

"అన్నీ వట్టి కల్పన. మంచి కూరలు ఎప్పటికప్పుడు బస్తీలోనే లభిస్తయి, ఒక కానీ ఎక్కువైనాసరే. ఇక్కడేమి దొరుకుతయి- మట్టి. ఇంక ఆరోగ్యమైన ప్రదేశా లంటున్నారా- కాదుమరి? మొన్ననే మహా చికమ సగం జనాభాని మింగి తన దారిని తాను పోయింది. తతిమ్మాసగం యీ కలరావంతు. ఈ చుట్టు పక్కల 10 మైళ్లలో ఒక్క ఆస్పత్రికూడా లేదు. ఇవన్నీ ఆరోగ్యకరమైన విషయాలు కాదూ?" అని అన్నాడు రామారావు వుద్రేకంగా.

ఇంతట్లో కూలీల ప్రతినిధులుగా సుబ్బాయి, కోటాయి, వెంకాయి హాజరైనారు.

ప్రపంచ పరిస్థితులూ, కష్టజీవుల భవిష్యత్తూ, రష్యాభూతల స్వర్గం- వీటిమీద ఒకగంట మాట్లాడి, తర్వాత వాళ్లు ప్రస్తుతం జీవిస్తున్న జీవితం, వాళ్ళని పై తరగతి వాళ్లు దోచుకుంటున్నదీ, దానికి విరుగుడూ తెలియ చెప్పాను. వాళ్లు తమ ఆమోదాన్ని యేకగ్రీవంగా తెలియజేశారు ప్రతి నా మాటకూ. అందులో సుబ్బాయి తెలివికలవాడు. వాడు యిదివరకే తమస్థితిని గుర్తించినట్లు కన్పడ్డాడు. కోటాయి వట్టి అమాయకుడు: అదుగడుక్కీ సందేహాలే.

మీతో రోజల్లా పని చేయించి సరిగ్గా ఒకపూటైనా కడుపునిండని కూలి యిస్తున్నారు. ఈ పరిస్థితులు మారాలి ఈ దోపిడీ విధానానికి స్వస్తి చెప్పాలి. దానికి మీరందరూ యేకంగావాలి

"చిత్తం. తమ సెల వేమిటి?" అన్నాడు సుబ్బాయి.

"ఆరి భూమికి ఆరి యిష్టం" అనిగాడు కోటాయి.

"మీ రందరూ యేకమై సమ్మెకట్టాలి" అన్నాను.

'ఔను బాబూ-కాని సమయం రావాలిగా?' అన్నాడు సుబ్బాయి.

"ఔను ఇది మంచి సమయమే. ఈ పనుల రద్దీలో మూడురూపాయిలు తక్కువ కూలి అయితే గిట్టదనాలి. దక్కుస్తూ యిస్తారు. ఇవ్వక పని మానుకుంటారా!"

'మే మెళ్ళకపోతే దేశం గొడ్డువోయిందా?' అడిగాడు కోటాయి.

'యేడిశావులేరా-' అన్నాడు సుబ్బాయి.

'అవునురా-అటుకూలికీ చెడి, యిటు కూటికీ చెడాలి.'

'ఎందుకు చెడతాము?' అన్నాడు సుబ్బాయి.

'మరంతేగా! మనం కూలికి వెళ్లకపోతే మానుకుంటారా? ఇంకో వూరి వాళ్ళని పిలుచుకుంటారు గాని.'

"మనం వెళ్ళి పక్కవూళ్లో ప్రచారం చెయ్యాలి. అలా చేస్తే ఎందుకొస్తారు? వాళ్లకి మాత్రం తెలియదా యీ అన్యాయం? వాళ్ళకి హృదయంలేదా?" అని అన్నాను.

'మనకి లేకపోయిందని వాళ్ళకి దిగులా, రాక పోవటానికి?'

'నీకు తెలియదులేరా- వాళ్లుమాత్రం అంత తెలివితక్కువవాళ్ళా, మనం సమ్మెచేస్తే రావ

టానికి?' అని గదమాయించాడు సుబ్బాయి.

కోటాయి యింక యేమీ మాట్లాడలేదు.

'సరే, యింక యిళ్లకు వెళ్లండి- రేపట్నుంచే సమ్మె ప్రారంభం' అని హెచ్చరించాను లేస్తూ.

సుబ్బాయి సందేహిస్తూ అక్కడే కూర్చుని వుండటంచూసి మళ్లీ చతికిలబడి—'ఏమిటి సందేహిస్తున్నావు?' అని అడిగాను

'మరీ—అయితే బాబూ, మూడు రూపాయిలడిగితే-నీ కెప్పుడన్నా మూడురూపాయిలు కూలి యిచ్చామట్రా? ఆరు చూడు. యీరుచూడు—అని అంటారు బాబూ' అన్నాడు సుబ్బాయి.

'ఏమైనాకానీ అంతకు తక్కువ రా మనాలి.'

'తమరు చెప్పింది నే వొప్పుకున్నా బాబూ. నే ననేది మనం మాట్లాడితే సబబుండద్దా-అని' అన్నాడు.

'మనం మాట్లాడేది సబబైనదే.'

సుబ్బాయి కాస్త విసుక్కొని, 'మనం చెప్పేది మనకు సబబైనదే అనుకోండి-మరి చూసేవారికి సబబుగా కన్పించవద్దా?' అన్నాడు. అప్పుడు అనుకున్నాను - కారల్ మార్క్స చెప్పింది ఎంత నగ్నసత్యం! హిందూదేశస్థులు వట్టి అమాయకు లన్నాడు. ఆమాట ముమ్మాటికీ నిజం అని రుజువుచేశాడు సుబ్బాయి. ఎన్ని కష్టాలు పడుతున్నా తమ నిజమైన హక్కు, తమకి న్యాయతఃరావల్సిన కూలీ అడగటానికి-చూసేవారికి న్యాయంగా కన్పిస్తుందా, లేదా అని సందేహిస్తున్నారు-అమాయకులు. వీళ్ళింత అమాయకులు కాబట్టే యిన్నివేల సంవత్సరాల నుంచి యీస్థితిలో వున్నారని అనుకున్నాను.

'అయితే యేం చేద్దాం?' అన్నాను.

'అదే నేనూ ఆలోచిస్తున్నాను. ముందు ఎవరయినా ఆకూలి యిస్తే-అరిట్టా యిచ్చారు-మీరు కూడా యిట్టా యివ్వాలి అని అడగవచ్చు...'' అంటూ నా ముఖంవంక చూశాడు.

నాకు ఒక విచిత్రమైన ఆలోచన కలిగింది. నేనే మూడు రూపాయిలు కూలి యిచ్చి నా పని చేయిస్తే, ముందు యిచ్చి వుద్యమ సాఫల్యానికి మార్గదర్శకుడినికూడా అవుతాను.బహుశా నా పేరు వీళ్ల జీవితాల్లో ఎప్పుడూ మరచిపోలేరు. సరయిన విప్లవవాది తన ఆచరణద్వారా యితరులకు మార్గదర్శి కావాలి.

'సరే, రేపు మన పనిలో కూలికిరండి. మన పని పూర్తి అయాక యింకోరికి పోవచ్చు' అన్నాను.

'' చిత్తం,సెలవు.''

ఆ సాయంత్రమే వీళ్లని అజ్ఞానసాగరంనుంచి విజ్ఞానసాగరంలోకి యీడవాలనే సదుద్దేశంతో తమతమ పిల్లల్ని రాత్రిపూట చదువుకోటానికి పంపవల్సిందిగా అడగటానికి వాళ్ల యిళ్లదగ్గరికి వెళ్లాను.

నా యీ సదుద్దేశానికి చాలా సంతోషించారు. 'బాబూ చదువుకోటానికి పలకలూ అవీ మాకుంకలకి ఎక్కడివి?'అని సుబ్బాయి అడిగాడు.

'నే తెప్పిస్తున్నాను లే.'

ఇంతలో నాకు మంచినీళ్లు కావలసి వచ్చినయి. కోటాయిని తీసుకురమ్మన్నాను.

'బాబూ' నే తె|స్తే పని కొస్తయ్యా?'

'ఏం? ఎందుకు పనికిరావు? మనం మాత్రం మనుషులము కామా?' అని సుబ్బాయి అడిగాడు. వాడిజ్ఞానోదయానికి నాకు చాలా సంతోషం వేసింది.

సందేహంతోనే వెళ్లాడు. ఏమీ లేదు. నేనేం చేసినా ఫరవాలేదు. నా కిచ్చిన పాపం తనకు చుట్టుకుంటుందన్న సందేహమై ఉంటుంది బహుశా.

మర్నాడు...

మాచేలో వూడ్పు. నాకింటిదగ్గరేమీ తోచటంలేదు. ఉద్యమం ప్రారంభించామనే ఉత్సాహం నన్ను పూర్తిగా ఆవహించింది. ఆ వుత్సాహం నన్నింట్లో కూర్చోనీయలేదు.

పొలానికి బయల్దేరాను; పొలం అంతా కోలాహలంగా వుంది కూలీలతో. నేనొస్తున్నానని నా మెప్పుకోసం కూలీల్ని పని తొందర చేస్తున్నాడు పాలేరు. ఒకటి రెండు సార్లు కసరటం కూడా నా కంట పడింది.

దగ్గర కొచ్చి- 'ఎందుకు కసురుతావు? వాళ్లు మాత్రం మనుషులుకారూ?' అని కోప్పడ్డాను.

పాలేరు నావంక వింతగా చూస్తూ వుండిపోయాడు. కూలీలు కొంత మంది గట్టుమీదకు చేరారు. ముందు ముందు వుద్యమ నిర్వహణలో సాధక బాధకాల్ని గూర్చి కొంచెంసేపు చర్చించాము. మేము గట్టుమీద చర్చ జరుపుతూంటే

చేలో సోదర క్రాంతి కుమారులు యేమి నిర్ణయాలు జరుగుతాయో అని ఆసక్తితో యెదురు చూస్తూ నిల్చున్నారు. ఆ దృశ్యం నాకు అగ్రరాజ్య విదేశాంగ మంత్రులు సమావేశమవుతున్నపుడు వారి నిర్ణయాలకోసం ఎదురుచూసే రాజకీయ వేత్తలను స్ఫురింపచేసింది.

కొంతసేపయిన తర్వాత ఎవరి దారిని వాళ్లు వెళ్లిపోయారు. పాలేరు, 'యివ్వాళ పనిలో సగంకూడా కాలేదు' అని సణగటంమాత్రమే విన్నాను.

మూడవనాడు...

కుర్రాళ్లంతా దాదాపు యిరవై మందిదాకా వచ్చారు. అందరికీ తలొక పలక, బలపం యిచ్చి వరసలో కూర్చోపెడుతున్నాను. 'నీ విట్లా వచ్చి కూర్చో'అని ఒక కుర్రాణ్ణి అన్నాను.

'ఇక్కడ కూర్చుంటాలెండి' అన్నాడు కదలకండా.

'ఇక్కడ కూర్చోమంటుంటే,' అన్నాను విసుగుగా.

'నేను మాలాణ్ణి తాకుతూ కూర్చోనండి.'

'వాడుమాత్రం మనిషి కాదట్రా?'

'ఏమోనండి. మా అయ్య వచ్చేటపుడుకూడా చెప్పాడు. మాలవాడ్ని తాకుతూ కూర్చోవద్దని' అన్నాడు భయపడుతూ. 'నే నడగనా?' అని నిగ్గతీశాను.

'మీతో చెప్పద్దన్నాడు' అని బిక్కమొగం వేశాడు.

'ఏం పర్వాలేదు. నే చెప్తాలే మీ వాళ్లకి. నే చెప్పినట్లు కూర్చోండి.'

'మా యింటిదగ్గర కొప్పడతారండి' అంటూ ఒకొక్కరే జారుకొన్నారు. మిగిలిందల్లా మాలకుర్రాళ్లు నల్గురుమాత్రమే.

పాలేర్ని పిలిచి, 'వాళ్ల పెద్దలదగ్గిరికి పోయి పిల్లల్ని పంపించమని చెప్పు' అని పంపాను.

ఒక అరగంట పిమ్మట వాడు తిరిగివచ్చి, 'ఆరు పంపరటండి. మాలాళ్లని తాకుతూ కంపటానికి మే మేమన్నా కులంచెడ్డ వాళ్లమా? అని అడిగారు.'

'సుబ్బాయితో చెప్పకపోయావా?'

'ఈ మాటలన్నది సుబ్బాయేనండి.'

'సుబ్బాయా?'

'అవునండీ'

'వెధవ,' అని నాకు తెలియకుండానే నా నోటివెంట అప్రయత్నంగా వచ్చేసింది. ఆ రోజుసాయంత్రం నాకు మంచినీళ్లు కావలసివచ్చినప్పటిదృశ్యం కళ్లకికట్టినట్లు కనిపించింది.

సమయంకోసం కాసుకు కూర్చున్న పాలేరు- 'యివ్వాళ రామయ్యగారికి రూపాయి కూలీకే యెళ్ళారండి' అని అన్నాడు.

'ఊఁ' అని ఒక దీర్ఘ నిశ్వాసమాత్రం వదిలినట్లుజ్ఞాపకం. ఆ రాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు. వీళ్లు అమాయకు లనుకొన్న నేను అమాయకుణ్ణయాను. నేను వూహించిన ప్రతిదానికీ వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. వీళ్ల మనస్తత్వం కూడా నేను అనుకున్నంత, విన్నంత, చదివినంత అమాయకమైనది కాదు. ఇక్కడికి వచ్చాక సగమైపోయాను. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూస్తూ పడుకొన్నాను. తెల్లవారి పంతుల్ని సామాను సర్దమన్నాను. వాడి మొగం చాటంత అయింది. ఇంతట్లో కోటయ్య మామ వచ్చాడు. 'ఎక్కడికిరా బాబూ, ప్రయాణం?' అని నవ్వుతూ కొంటెగా ప్రశ్నించాడు.

'బెజవాడ '

'మళ్లీ ఎపుడు రావటం?'

'ఇప్పట్లో రాను మామయ్యా... 'అని నాకు జరిగిన పరాభవమంతా చెప్పాను. 'వీళ్లు మనుష్యులు కారు. ద్విపాద పశువులు. వీళ్లవల్ల విప్లవాలు జరుగుతా యనుకోవటం తెలివి తక్కువ.'

'అది వీళ్ల లోపంగాదు. ప్రతివాళ్లూ వచ్చి వీళ్లని అసహ్యంచుకొని పోతే ఎపుడూ యిట్లాగే వుంటారు. ఏ విప్లవాలలైనా విజయవంతం ఐనాయంటే ముఖ్యకారణం మధ్యతరగతి. వాళ్లస్థితి త్రిశంకు స్వర్గం. అటు పెద్దతరగతి సాంగత్యం వల్ల ఆ నాగరికతా, విజ్ఞానం అబ్బాయి. ఇటు చిన్నతరగతి చాలీచాలని ఆర్థికస్థితి. ముందు మధ్యతరగతిని తయారుచేసి దానికి నాయకత్వమిస్తేగాని యే విప్లవమూ నెగ్గదు. పిచ్చిపిచ్చి అనవసరపు సమ్మెలు చేయించి వీళ్ళని మాడ్చేకంటే ముందు ఆ మధ్యతరగతిని మేల్కొల్పు.' అని సలహా యిచ్చాడు.

'బెజవాడ వెళ్లి కాస్త కోలుకున్న తర్వాత నిన్నడిగి ఆపని చేస్తానులే' అన్నాను.